
క్లుప్తంగా

'శివబాల గణపతి' అలంకారంలో దుర్గా గణపతి



సీతంపేటలో 'శివబాల గణపతి' అలంకారంలో దుర్గా గణపతి

సీతంపేట : వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీతంపేటలో కొలువైన దుర్గా గణపతి ఐదో రోజు బుధవారం 'శివబాల గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివునికి పాలాభిషేకం చేస్తున్నట్టు గణపతిని చూడముచ్చటగా అలంకరించారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, స్వామి వారికి పంచామృత అభిషేకం, చందన, విభూది, ఫల రసాలతో విశేష అభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. గురువారం 'వాణి గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి యువసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని ఎంపీ శ్రీభరత్, కార్పొరేటర్ కంపా హనోకు బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో ద్వారకా సీఐ భేటీ



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి మొక్క అందజేస్తున్న సీఐ రమణ

సీతమ్మధార : ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుని ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ డి.వెంకట రమణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సీతమ్మధార దరి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి మొక్క అందజేశారు. ఈ నెల 8న సీఐగా రమణ బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మురళీనగర్ : జోన్ – 2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతినగర్, అప్పర్ జయప్రకాష్‌నగర్, బాబూజీనగర్, తిక్కవానిపాలెం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్స్, పెదకొత్తూరు, ఏఎస్సార్ నగర్, జయప్రకాష్‌నగర్, సురేష్‌రామ్‌నగర్, జగజ్జీవన్‌నగర్, అంబేడ్కర్‌నగర్, ఇందిరానగర్ 1 – 5 ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

చిన్నారుల దీపారాధన

కంచరపాలెం : స్థానిక గొల్లకంచరపాలెంలో వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా రాధికాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం దీపారాధన నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు, చిన్నారులు గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం అన్నసంతర్పణ, సోమవారం నిమజ్జనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఓంకారం, గణేష్ ఆకారంతో సర్వమత సమ్మేళనంతో రంగులు వేసి దీపాలు వెలిగించారు. ట్రస్టు సభ్యులు జ్యోతేష్, జశ్వంత్, మాన్విత, శ్రావణి, నిఖిల, సాద్విక్, కుశల్, శ్రావ్య, వెంకటలక్ష్మి, జాహ్నవి, భాగ్యశ్రీ, విశ్వేశ్వరి, గుణశేఖర్, జశ్వంత్, జగదీశ్వరరావు, ప్రణయ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కొండవాలు

- బిక్కుబిక్కుమంటున్న నివాసులు
- ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన



రాంజీ ఎస్టేట్‌లో ప్రమాదకరంగా...



కప్పరాడ కొండల్లో ప్రమాదపు అంచుల్లో ఇళ్లు



జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం కస్తూరినగర్‌లో విరిగిపడిన కొండచరియలు

కంచరపాలెం : నగర పరిధిలోని కంచరపాలెం, తాటిచెట్లపాలెం, కైలాసపురం, ఊర్వశి కూడలితోపాటు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతాల్లో నివాసితులు ప్రాణం గుప్పిట్లో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల తెరిపివ్వని వర్షాలతో కొండవాలులో రాళ్లు, మట్టిపెళ్లలు జారిపడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. జీవీఎంసీ 46, 47, 48 వార్డుల కొండవాలు ప్రాంతాలు అంబేడ్కర్ ఎస్టేట్, అరుంధతినగర్, కస్తూరినగర్, మధుసూధననగర్, శాంతినగర్, బాపూజీనగర్, ఇందిరానగర్, సంజీవయ్య కాలనీ, శివలింగపురం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, అల్లూరి సీతారామరాజు నగర్, జై భారత్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండ చరియల్లోని రాళ్లు, మట్టి పెళ్లలు జారిపడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో కొండవాలు ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. నాలుగు రోజుల కిందట జరిగిన సంఘటనల్లో భారీగా వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదాల సమయంలోనే హడావిడి

జీవీఎంసీ 46, 47, 48 వార్డుల పరిధిలోని కొండవాలులో అధిక సంఖ్యలో ఇళ్లు నిర్మించారు. కొండవాలు అంచుల్లో సుమారు 6 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. భారీగా కురిసిన వర్షాలకు ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టంగా స్థానికులు భావిస్తున్నారు. అదే ప్రాణాలు కోల్పోయే సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హడావిడి అంతా ఇంతా ఉండదని విమర్శిస్తున్నారు. ఆ సమయంలో భారీగా అంచనాలు వేసి ప్రణాళికలు సిద్ధం చేయమని అధికారులకు ఆదేశించి ప్రజాప్రతినిధులు చేతులు దులిపేసుకుంటారని, గతంలోనూ అలానే చేశారని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. ఆచరణలో మాత్రం రక్షణ గోడల జాడే కనిపించదని కొండవాలు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ గతంలో జరిగిన ప్రమాదాలు

- జీవీఎంసీ 47వ వార్డు సురేష్‌రామ్‌నగర్‌లో 2012 జూన్‌లో కొండచరియలు జారి పడడంతో బండరాళ్లు ఇళ్లపైకి చేరాయి. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదు.
- 2015 డిసెంబర్‌లో జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం సమీప సంజీవయ్యకాలనీలో అర్ధరాత్రి ఇళ్లపైకి బండరాళ్లు జారిపడడంతో రెండు ఇళ్లలో నివసిస్తున్న వారు మరణించారు.
- 2017 జూన్‌లో 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ రాంజీ ఎస్టేట్‌లో భారీ వర్షాలకు మట్టిపెళ్లలు విరిగి ఇళ్లపై పడ్డాయి. ప్రాణనష్టం జరగలేదు.



47వ వార్డు అరుంధతి నగర్‌లో విరిగిపడిన కొండచరియలు

- 2018లో 48వ వార్డు ఊర్వశి కూడలిలో ఇందిరానగర్, అల్లూరి సీతారామరాజు కాలనీలో వర్షాలకు రాళ్లు జారి ఇళ్లపై పడ్డాయి.
- ఈ ఏడాది ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు 48వ వార్డు శ్రీనివాసనగర్‌లో కొండ చరియలు విరిగి పడడంతో ఓ రేకుల షెడ్డు ధ్వంసమైంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

నెరవేరని నాయకుల హామీ



కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రమాద సమయంలోనే ప్రజాప్రతినిధులు, అధికారులు కనిపించి హడావిడి చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ప్రమాదపు అంచుల్లో నివసిస్తున్నాం. ఇప్పటికైనా రక్షణ గోడల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి.

– కె.చిన్న, తాటిచెట్లపాలెం

వర్షం కురిస్తే ఆందోళన



కొండల పైనుంచి బండరాళ్లు ఇళ్లల్లోకి దూసుకొచ్చి ప్రాణాలు పోతున్నా అధికారుల్లో చలనం ఉండడం లేదు. మెట్లమార్గాలు వర్షాలకు నాచుపట్టి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కొండల చుట్టూ రక్షణ గోడ నిర్మాణం ప్రతిపాదనలు అమలు కాకపోవడానికి నాయకుల నిర్లక్ష్యమే కారణం.

– ఆర్.అప్పలరెడ్డి, కంచరపాలెం

జనగణనతోనే బీసీల అభివృద్ధి సాధ్యం



సమావేశంలో నినాదాలు చేస్తున్న బీసీ సంఘ నాయకులు

సీతంపేట : దేశంలో బీసీలు అభివృద్ధి చెందాలంటే బీసీల జనాభా ఎంత అనేది తెలియాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, శెట్టి బలిజ రాష్ట్ర నాయకుడు కట్టా మల్లేశ్వరరావు అన్నారు. బహుజన సమాజ్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పెదపెంకి శివప్రసాద్ అధ్యక్షతన స్థానిక పౌర గ్రంథాలయంలో నిర్వహించిన విశాఖ జిల్లా బీసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైనా భారతదేశంలో బీసీల జనాభా ఎంత అనేది తెలియకుండా ఉందన్నారు. జనగణనకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో, అసెంబ్లీలో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 139 బీసీ కులాలు ఉన్నప్పటికీ 111కి పైగా కులాలకు చట్టసభల్లో ఒక్క అవకాశం కూడా ఇప్పటి వరకు రాలేదని, దీనిని బీసీలంతా గమనించాలన్నారు. ఓబీసీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగం గురించి యువతకు తెలియజేసేలా పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని కోరారు. సమావేశంలో బీసీ నాయకులు డాక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు, డాక్టర్ పి.బి.చిట్టి, మహేష్ గౌడ్, రొట్ట శ్రీను, పి.ఎస్.రామారావు, అతుకంశెట్టి రామచంద్రరావు, 15 కులాల బీసీ నాయకులు, బహుజన సమాజ్ పార్టీ జిల్లా కార్యవర్గం పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకుందాం

మురళీనగర్ : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారి వివరాలు సభ్యుల దృష్టికి వచ్చినట్లయితే ఆదుకుందామని పిలుపునిచ్చారు. భారీ వరదలకు సర్వం కోల్పోయిన విజయవాడ పరిసరాల ప్రజలకు సాయం చేయడానికి రూ.75,116లు విరాళాలు అందించిన సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సహకారం అందించాలని కోరారు. క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, క్లబ్ పూర్వాధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, కె.ద్వారకానాథ్, ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, సీహెచ్ ప్రసాదరావు, టీవీ రమణ పాల్గొన్నారు.

గణపతి మండపాల వద్ద అన్నసమారాధన



నందగిరినగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న డాక్టర్ రామ్‌కుమార్



జీవీఎంసీ 51వ వార్డులో అన్న ప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



అన్నప్రసాదం వడ్డిస్తున్న పైడి రమణ తదితరులు



సీతమ్మధార రైతుబజారులో వినాయకుని సన్నిధిలో మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్

సీతంపేట : నందగిరినగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ అధినేత డాక్టర్ రామ్‌కుమార్ భక్తులకు వడ్డన చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. సంఘం ప్రతినిధులు బొడ్డేటి ప్రకాష్, గేదెల వెంకన్న, రాజు, గోపి, వెంకటరావు, రాము, రెహమాన్, గోవింద్, జగ్గా, సతీష్, బాబి, అర్జున పాల్గొన్నారు.

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డులో వినాయక చవితి సందర్భంగా పలు చోట్ల అన్నసమారాధన ఏర్పాటు చేశారు. శంకర్‌నగర్ యంగ్ టైగర్స్ బాయ్స్ ఆధ్వర్యంలో, గాంధీనగర్ – 1 జై భీమ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అన్న సంతర్పణలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని వడ్డన చేశారు. ఆయన ముందుగా వినాయకుడిని దర్శించుకున్నారు.

- జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ హరిహర క్షేత్రంలో వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్ష్మీనారాయణపురంలో...

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు పరిధి లక్ష్మీనారాయణపురంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు బుధవారం భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు పైడిరమణ అన్నదానం ప్రారంభించారు. కమిటీ సభ్యులు పైడి శ్రీను, అద్దంకి ఈశ్వరరావు, రమణ, జగదీష్ పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో అన్నదానం

సీతమ్మధార : స్థానిక రైతుబజార్‌లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఏడీ రాకేష్, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి పాపారావు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. రైతుబజార్‌కి వచ్చే వినియోగదారులు, రైతులు, వ్యాపారులు, సిబ్బంది వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం అనుపోత్సవం నిర్వహిస్తామని ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ తెలిపారు.

రంగసాయి కళాపీఠం ప్రారంభం



రంగసాయి కళాపీఠం పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ రమణమూర్తి, తదితరులు

సీతమ్మధార : కళారంగంలో నిత్యం సేవలు అందిస్తున్న బాదంగీర్ సాయి బుధవారం రంగసాయి కళాపీఠం సంస్థను స్థాపించారు. ఈ మేరకు ద్వారకానగర్‌లో గల కళా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ పి.వి.రమణమూర్తి పోస్టర్ ఆవిష్కరించి, సంస్థను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాదంగీర్ సాయి గత 36 సంవత్సరాలుగా కళారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విశాఖలో నాటక గ్రంథాలయం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ముఖ్యంగా సురభి నాటకాలు విశాఖ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. కళాపీఠం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఏదో తెలియని శక్తి ముందుకు నడిపిస్తుందన్నారు. ఇటీవలే పీఎం పాలెంలో ప్రదర్శించిన పుటుక్కు జరజర డుబుక్కుమే నాటిక విశేష ఆదరణ పొందిందని గుర్తు చేశారు. దీంతో ప్రజల చెంతనే నాటికల ప్రదర్శనకు శ్రీకారం చుట్టామన్నారు. విశాఖలోని అపార్ట్‌మెంట్లలో నాటికలను ప్రజల చెంతనే ప్రదర్శిస్తామని వివరించారు. కార్యక్రమంలో రంగస్థల నటి శివజ్యోతి, రంగసాయి సంస్థ సభ్యులు ఆదినారాయణ, వియ్యపు రామకృష్ణ, జమ్మా చినబాబు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు





అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట : జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం, ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా జోన్ – 3 పరిధిలో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌కు ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించడానికి బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కోట్లాది రూపాయలతో అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌ను విస్తరించి... ఇరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించేసి వ్యాపారం చేసుకుంటున్నారు.

దీంతో పాదచారులు రద్దీ రహదారిలో నడవలేక, ఫుట్‌పాత్‌పై నడిచే వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పాదచారుల అవస్థలపై 'ఫుట్‌పాత్‌లు ఉన్నా లేనట్టే' శీర్షికతో ఈ నెల 10న సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. జోన్ – 3 అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటేశ్వరరావు, టీపీవో ప్రమీల, ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం హైవే నుంచి దొండపర్తి కూడలి వరకు 26, 27 వార్డుల పరిధిలో ఉన్న ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, విక్రయానికి ఉంచిన సామగ్రిని సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లు పాదచారులు నడవడానికి నిర్మించారని, వాటిని ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాల నిర్వహణ, వస్తువులు ఉంచితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు. రహదారిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

రోడ్లపై ప్రైవేట్ ట్రావెల్ బస్సులు నిలపొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారకా సీఐ ప్రసాద్, చిత్రంలో ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార : రోడ్ల మీద ప్రైవేట్ ట్రావెల్ బస్సులు పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించొద్దని ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ప్రైవేట్ ట్రావెల్ బస్సుల నిర్వాహకులతో రామాటాకీస్ వద్ద బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామాటాకీస్ నుంచి సత్యం జంక్షన్‌కి వెళ్లే మార్గంలో విశాఖ కంటి ఆస్పత్రి, తదితర ప్రాంతాల్లో ప్రైవేట్ ట్రావెల్ బస్సులు రోడ్డు మీద అధిక సమయం పార్కింగ్ చేసి వుంచడం వల్ల రెగ్యులర్ ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతోందన్నారు. ప్రయాణికులను సకాలంలో బస్సులు ఎక్కించుకుని త్వరితగతిన వెళ్లిపోయేలా నిర్వాహకులు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఈ ప్రాంతంలో తరచూ గంజాయి, మద్యం అక్రమంగా రవాణా చేస్తూ నిందితులు దొరుకుతున్నందున బస్సు నిర్వాహకులు విధిగా ప్రయాణికుల లగేజీలు తనిఖీ చేయాల్సిన బాధ్యత వుందన్నారు. ఎవరి మీదైనా అనుమానం కలిగితే వెంటనే ద్వారకా పోలీసులకు సమాచారమివ్వాలని ఆయన సూచించారు. సమావేశంలో ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు పాల్గొనారు.

'మేడ్ ఫర్ ఈచ్ అదర్స్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బేతవోలు రామబ్రహ్మం, తదితరులు

సీతంపేట : ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు రచించిన హాస్య కథల సంపుటి 'మేడ్ ఫర్ ఈచ్ అదర్స్' పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రముఖ రచయిత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్యాన్ని సృష్టించడం కత్తిమీద సాములా చాలా కష్టమైన ప్రక్రియ అని, అటువంటి ప్రక్రియలో ద్విభాష్యం రాజేశ్వరరావుది అందెవేసిన చేయి అని ప్రశంసించారు. హాస్య కథలు చాలా క్లుప్తంగా, గుట్టుగా, పాఠకులు ఆస్వాదించే విధంగా చెప్పాల్సి ఉంటుందన్నారు. అలాంటి గొప్ప కథా రచయిత గతంలో రచించిన 'చెట్టంత మనిషి' కథా సంపుటి చదివానని, ఎంతో అద్భుతంగా రాశారన్నారు. ప్రతి కథలో చివరన మంచి సందేశం ఇవ్వడం తనకు నచ్చిందన్నారు. విశాఖపట్నంకు ద్విభాష్యం రాజేశ్వరరావు ఆస్థాన కథా రచయిత అని కొనియాడారు. అటువంటి గొప్ప కథా రచయిత రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కొచ్చెర్లకోట జగదీష్ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో కథా రచయిత జె.పి.శర్మ, వోలేటి పార్వతీశం, మద్దాళి రఘురాం, పలువురు రచయితలు, సాహితీవేత్తలు, కవులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఉచితంగా క్షవరం



వసతిగృహంలో నిరాశ్రయులకు క్షవరం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

సీతమ్మధార: మానవ సేవే మాధవ సేవ అన్న సిద్ధాంతంతో కంచరపాలెం ప్రాంతానికి చెందిన నాయీబ్రాహ్మణుల సంఘం సభ్యులు నిరాశ్రయులకు ఉచితంగా క్షవరం చేస్తున్నారు. ఇందులో భాగంగా ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో గల వారికి బుధవారం ఉచితంగా క్షవరాలు చేశారు. ఇక్కడ వున్న వృద్ధులు, మానసిక రోగులకు క్షవరాలు చేసి సేవాభావం చాటుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులకు ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు ధన్యవాదాలు తెలిపారు.

వరద బాధితులకు రూ.4.55 లక్షల సాయం



వరద బాధితులకు సాయం అందిస్తున్న అన్నమాచార్య సేవా ట్రస్టు సభ్యులు



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు విరాళాలు అందజేస్తున్న ఆర్పీలు, సీవోలు

సీతమ్మధార : విజయవాడ వరద బాధితులకు నియోజకవర్గంలోని పొదుపు సంఘాలు, సీవోలు, ఆర్పీలు సేకరించిన రూ.4,55,560ల విరాళం చెక్కుని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల కార్యాలయంలో బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విజయవాడలో వరదలు వచ్చిన పది రోజుల్లోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఒక నెల వేతనం విరాళంగా ఇప్పటికే అందజేశారు. ఎమ్మెల్యే సతీమణి సీతా సుజాత రూ.లక్ష, ఎమ్మెల్యే తల్లి వెంకట నరసు రూ.50 వేలు, కుటుంబ సభ్యులు రూ.80 వేలు కలిపి మొత్తం రూ.3.50 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ చెక్కులను శ్యామల దీపిక ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కృష్ణ, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

సీతంపేట : శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు రెండు టన్నుల నిత్యావసర సరకులు, వస్త్రాలు, మందులు, శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. జక్కంపూడి, కబేళా, సింగ్‌నగర్, వైఎస్సార్ కాలనీ ప్రాంతాల్లో సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చీఫ్ డైరెక్టర్ సునీత కొటారి, కో ఆర్డినేటర్ నాగలక్ష్మి, వి.పి.పి.రాజశేఖర్ పాల్గొన్నారు.